క్లుప్తంగా

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

తిరుపతి రూరల్: పేద విద్యార్థుల చదువుకు ట్రస్ట్ తరపున అండగా నిలుస్తామని ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసునిస్సా బేగం తెలిపారు. సోమవారం తిరుపతి రూరల్ మండలం ఓటేరు గంగిరెడ్డు కాలనీలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. అనంతరం కాలనీలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ ఆర్టీఐ రాష్ట్ర మహిళా అధ్యక్షులు చంద్రకళారెడ్డి, భవ్యశ్రీ పాల్గొన్నారు.

చంద్రగిరి ఉప సర్పంచ్‌కి పితృ వియోగం



రఘునాథరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి : చంద్రగిరి ఉప సర్పంచ్ నగరి చంద్రశేఖర్‌రెడ్డి తండ్రి రఘునాథ రెడ్డి(72) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వెంటనే చంద్రశేఖర్‌రెడ్డి నివాసానికి వెళ్లి రఘునాథరెడ్డి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నిషేధం తొలగింపునకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : ఆటోనగర్ కార్మికులకు రిజిస్ట్రేషన్ చేయించిన భూములను నిషేధ జాబితా నుంచి తొలగించాలని ఎస్వీ ఆటోనగర్ అసోసియేషన్ నేతలు హరిబాబు, శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. అక్కారాంపల్లె, మంగళంలో 32 ఎకరాల 7 సెంట్లలో 350 ప్లాట్లు వేసి కార్మికులకు పంపిణీ చేశారని, అయితే సదరు భూమిని నిషేధ జాబితాలో చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. జాబితా నుంచి తమ భూములను తొలగించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు, పురుషోత్తం, బాలకృష్ణారెడ్డి, మల్లికార్జున, సురేంద్రరెడ్డి, హరి పాల్గొన్నారు.

రక్తదానం.. సామాజిక అవసరం



సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపల్ నాధమునిరెడ్డి

తిరుపతి సిటీ : రక్తదానం సామాజిక అవసరమని అన్నమాచార్యా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ నాధముని రెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ మెటర్నటీ ఆస్పత్రి సహకారంతో ఏఐటీఎస్ కళాశాలలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రక్తదానం ఆరోగ్యకరమైన అలవాటని, యువత రక్తదానం చేయాలని సూచించారు. సుమారు 300మంది విద్యార్థులు 300 యూనిట్లు రక్తాన్ని దానం చేశారు. అనంతరం రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందించారు.

వేలం ద్వారా రూ.24లక్షలు

పాకాల : వనరుల వేలం ద్వారా పాకాల పంచాయతీకి రూ.24.12లక్షల ఆదాయం చేకూరినట్లు ఈఓపీఆర్‌డీ మాలతి తెలిపారు. సర్పంచ్ కస్తూరి సమక్షంలో సోమవారం నిర్వహించిన వేలంలో వారపు సంతను రూ.15,55,000లు, దినసరి మార్కెట్ రూ.7,25,000లు, ప్రైవేట్ బస్టాండ్ రూ.90వేలు, జంతువధ శాలలు రూ.42వేలకు పాట దారులు దక్కించుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఓ మోతీ పాల్గొన్నారు.

రోహిణికి డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈసీఈ పరిశోధక విద్యార్థి సంగీతం రోహిణికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎస్.నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఆమె ఆగ్రో మెట్రోలాజికల్ మోడల్ ఫర్ ఎస్టిమేషన్ ఆఫ్ క్రాప్‌యల్డ్ ఇన్ ఏపీ యూజింగ్ ఏఐ అండ్ ఎంఎల్ టెక్నిక్స్ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్



సమస్యల సేకరణలో ఎస్టీయూ నేతలు

రామచంద్రాపురం: టీచర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ నేత నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పాఠశాలల్లో ఎస్టీయూ సభ్య స్వీకరణ, సమస్యల సేకరణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జీఎల్ఐ మెచ్యూరిటీ క్లెయిమ్, ఎర్న్ లీవ్ నగదును ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఎస్టీయూ నేతలు జగన్నాథం, వాసు, వరప్రసాద్, జగన్మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమాదేవి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్ఎంసీ ఎన్నికలు

చంద్రగిరి : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాల ని ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్‌బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ స్థాని క ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలు చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు మె నూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని స్పష్టం చేశారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలో అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

విద్యాలయాల్లో ర్యాగింగ్ భూతం విస్తరిస్తోంది. సీనియర్ల రూపంలో జూనియర్ విద్యార్థులను వేధిస్తోంది. సరదా పేరిట సాగిస్తున్న ఆకతాయిల వికృత చేష్టలకు నవతరం బెంబేలెత్తుతోంది. బంగారు భవిష్యత్తును ఊహించుకుంటూ కళాశాలలో అడుగుపెట్టిన పిల్లలను అంధకారంలోకి నెట్టేస్తోంది. మానసికంగా కుంగిపోయిన కొందరు విద్యార్థుల ప్రాణాలను సైతం హరిస్తోంది. ఎన్నో కలలతో బిడ్డలను కాలేజీకి పంపిన తల్లిదండ్రులకు తీరని వేదన మిగులుస్తోంది. ఉన్నత విద్యావంతులే విపరీత పోకడలకు పోవడం విద్యావేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. చాప కింద నీరులా వ్యాపిస్తున్న ఈ విష సంస్కృతికి అడ్డుకట్టవేయాల్సిన తరుణం ఆసన్నమైంది. యువతే మేలుకుని.. తమ భవితను ఉత్తమంగా మలుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రారంభమైన ఇంజినీరింగ్ తరగతులు
- ఫ్రెషర్స్‌ను వెంటాడుతున్న ర్యాగింగ్ భయం
- విద్యాసంస్థల్లో విస్తరిస్తున్న విష సంస్కృతి
- కళాశాల నిర్వాహకుల ఉదాసీనతే కారణం
- వికృత పోకడలకు అడ్డుకట్టవేయాలంటున్న విద్యావేత్తలు



యువతా మేలుకో.. భవితను మలుచుకో..!

తిరుపతి సిటీ: కోటి ఆశలతో ఉన్నత విద్యనభ్యసించేందుకు కళాశాలల్లో చేరిన విద్యార్థులను ర్యాగింగ్ భూతం వెంటాడుతోంది. సీనియర్ విద్యార్థులు సరదా పేరుతో కొత్తగా కళాశాలలో చేరిన జూనియర్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా వేధించి పైశాచిక ఆనందం పొందుతూ దానికి ర్యాగింగ్ అని పేరు పెట్టారు. ఈ వికృత క్రీడ నిరోధానికి సరైన నిఘా కొరవడటం, విద్యార్థుల మధ్య తలెత్తే ప్రాంతీయ, భాష, సంస్కృతి, కుల, మత, ఆర్థిక స్థితిగతుల్లో అంతరాలతో తీవ్రస్థాయికి చేరుకుంది. కాలేజీల యాజమాన్యాల ఉదాసీనత దీనికి ప్రధాన కారణం.

భయం గుప్పిట్లో విద్యార్థులు

కళాశాలల్లో ఫ్రెషర్స్ అడుగుపెడుతున్న నేపథ్యంలో ర్యాగింగ్ భయం విద్యార్థులను, తల్లిదండ్రులను వణికిస్తోంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే తిరుపతిలో ర్యాగింగ్ సంస్కృతి తక్కువే అని చెప్పవచ్చు. కానీ తరచూ ఎక్కడో ఒక చోట ఈ వికృతం కొనసాగుతూనే ఉంది. సుమారు 40 శాతం మంది ఏదో రకంగా ర్యాగింగ్ బారిన పడుతున్నారనేది అక్షర సత్యం. యాజమాన్యాల జోక్యం, విద్యార్థులు, తల్లిదండ్రుల అభ్యర్థన, రాజీ వంటి కారణాలతో కొన్ని కేసులు నమోదు కాలేదు. యూజీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌లో దేశవ్యాప్తంగా 2021–22 విద్యాసంవత్సరంలో 582 కేసులు, 2022–23లో 858, 2023–24లో 1240 ఫిర్యాదులు అందాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టం–1997 తీసుకువచ్చింది. ర్యాగింగ్ తీవ్రతను బట్టి పోలీసులు కేసులు నమోదు చేస్తారు. నిందితుడికి ఏడాది నుంచి జీవితఖైదు వరకు శిక్ష పడే అవకాశముంటుంది.

అడ్డుకట్ట ఇలా..

- కళాశాలల్లో ర్యాగింగ్ బాధితులు ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్, ఈ మెయిల్ అడ్రస్, ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలి.
- క్రమం తప్పకుండా యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- యాంటీ ర్యాగింగ్ స్టిక్కర్స్, పోస్టర్లను కళాశాలలు, హాస్టళ్లలో అతికించాలి.
- స్థానిక పోలీసు అధికారుల ఫోన్ నంబర్లను కళాశాలలో ప్రదర్శించాలి
- ర్యాగింగ్ బాధితుల్లో మానసిక ఒత్తిడి, ఆందోళనను తగ్గించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలి
- కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చాలి.

నిరంతర పర్యవేక్షణ



విద్యాసంస్థల్లో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలి. ఎక్కడికక్కడ యాంటీ ర్యాగింగ్ సూచిక బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. త్వరలో ప్రతి కళాశాలను పరిశీలిస్తాం. విద్యాసంస్థల యాజమాన్యాలు అప్రమత్తంగా వ్యవహరించాలి. పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని వికృత చేష్టలకు పాల్పడ్డవారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం.

– సుబ్బరాయుడు, ఎస్పీ, తిరుపతి

కఠినంగా వ్యవహరిస్తాం



ర్యాగింగ్ మాట ఎస్వీయూలో వినపడకుండా చర్యలు తీసుకుంటున్నాం. కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తాం. నూతన విద్యార్థులకు ఏ సమస్య ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు వర్సిటీ అధికారులు, అధ్యాపకులు నిత్యం అందుబాటులో ఉంటారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తాం.

– అప్పారావు, ఇన్‌చార్జి వీసీ, ఎస్వీయూ

కమిటీల ఏర్పాటు



మహిళా వర్సిటీలో యాంటీర్యాగింగ్ కమిటీలను ఏటా ఏర్పాటు చేస్తున్నాం. ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. యువత ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. చిన్న పొరబాట్లు చేసి బంగారు భవితను నాశనం చేసుకోవద్దు. కొత్త విద్యార్థులకు కళాశాలల్లో, హస్టల్స్‌లో ఇబ్బందులు ఎదురైతే వార్డన్స్‌కు, అధికారులకు ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చు. విద్యార్థినుల భద్రతే ధ్యేయంగా వర్సిటీ పనిచేస్తుంది.

– ఉమ, ఇన్‌చార్జి వీసీ, మహిళా వర్సిటీ

అంధకారం చేసుకోవద్దు



సరదాల పేరుతో నూతన విద్యార్థులను సీనియర్లు వేధిస్తే కళాశాల నుంచి బహిష్కరించి, కేసులు నమోదు చేస్తాం. చిన్న తప్పిదాలతో జీవితాలను అంధకారం చేసుకోవద్దు. విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలను ఎంపిక చేసుకుని కలల సాకారానికి నిరంతరం కృషి చేయాలి. ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, విద్యాసంస్థలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి.

– జేవీ రమణ, ఇన్‌చార్జి వీసీ, వెటర్నరీ వర్సిటీ

ఎన్నికల బరిలో 'ఎస్‌డబ్ల్యూఎఫ్'

తిరుపతి కల్చరల్ : టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంక్ పాలకమండలి ఎన్నికల్లో స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) అభ్యర్థులుగా రత్నప్రభాకర్, నైనార్ పద్మనాభం, పట్నం దయాకర్ బరిలో దిగుతున్నట్లు ఫ్రంట్ గౌరవాధ్యక్షుడు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గుణశేఖర్ తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఎంప్లాయీస్ బ్యాంక్ చైర్మన్‌గా, డైరెక్టర్‌గా తాము ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేశామని చెప్పారు. ఇప్పటి వరకు తమకు కల్పించిన బాధ్యతలో ఉద్యోగులు సేవలు అందించామన్నారు. ఈ క్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ అభ్యర్థులను ఆదరించి మరిన్ని సేవలు అందించేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఫ్రంట్ ప్రతినిధులు హనుమంతరెడ్డి, పృథ్వీ, సురేష్ పాల్గొన్నారు.

భూ పంపిణీకి వినతి

పాకాల : నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలని గ్రామీణ పేదల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. సోమవారం ఈ మేరకు తహసీల్దార్ నిత్యాందబాబుకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వ బంజరు భూములను పేదలకు ఇవ్వాలని, స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. అడవి పందుల దాడిలో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

ఇసుకాసురుల నుంచి భూరక్షణకు..

తిరుచానూరు(చంద్రగిరి) : ఇసుక మాఫియా నుంచి తన భూమిని కాపాడాలంటూ విశ్రాంత డీపీఆర్‌ఓ శంకర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన తరపున బంధువులు సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు వినతి సమర్పించారు. తిరుపతి పెద్దకాపువీధికి చెందిన శంకర్ రెడ్డికి తిరుచానూరులోని సర్వే నంబరు 464లో సుమారు 12.55 ఎకరాల మామిడితోట ఉంది. అయితే కొద్ది రోజులుగా అదే గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు సదరు భూమిలో ఇసుకను తవ్వేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. . ప్రస్తుతం శంకర్ రెడ్డి విదేశాల్లో ఉండటంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతూ ఇసుకను దోచేస్తున్నారు. ఈవిషయం తెలుసుకున్న శంకర్‌రెడ్డి ఓ వీడియోను పోస్టు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తన తోటలో ఇసుకను కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాళ్లు కాలాయ్..కారకులను శిక్షించండి



మాట్లాడుతున్న బాధితురాలు శారద

తిరుపతి కల్చరల్ : అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల ఉచ్చులో పడి తన రెండు కాళ్లు దెబ్బతిన్నాయని, ఇందుకు కారకులను శిక్షించాలని శారద అనే బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ కన్నీటిపర్యంతమయ్యారు. చిన్నగొట్టిగల్లు మండలం, దిగవూరు గ్రామం, పాలమాకుల పల్లెకు చెందిన తాను జూలై 6వ తేదీన విద్యుదాఘాతానికి గురయ్యానని వెల్లడించింది. ఉమాశేఖర్ అనే వ్యక్తి, మరో ఇద్దరితో కలిసి అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగలడంతో కాళ్లు కాలిపోయాయని వివరించింది. స్విమ్స్‌లో కాళ్లకు సర్జరీ చేశారని, కోలుకోవడానికి మూడేళ్లు పడుతుందని వైద్యులు చెప్పారని తెలిపింది. ప్రమాదం జరిగినప్పుడు రూ.5లక్షల పరిహారం ఇస్తామని చెప్పి, ఇప్పుడు బెదిరింపులకు దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి న్యాయం జరిగేలా చూడాలని కోరింది

స్వయం ఉపాధికి కేంద్రమే భరోసా



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : యువత స్వయం ఉపాధికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి స్థాయిలో భరోసా కల్పిస్తోందని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. శ్రీశ టెక్నాలజీ సహకారంతో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధి కోసం నిర్వహించిన ఉచిత విశ్వకర్మ శిక్షణ ముగిసింది. సోమవారం ఈ మేరకు తిరుపతి యూత్ హాస్టల్లో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రూ.15 వేల విలువైన టూల్ కిట్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు వెయ్యి మంది మహిళల స్వయం ఉపాధికి మార్గం చూపుతున్న మాస్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. శిక్షణ కాలంలోనూ రోజుకు రూ.500 చొప్పున స్టయిఫండ్‌ను సైతం ఇవ్వడమే కాకుండా, బ్యాంకుల ద్వారా రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలను కేంద్రం అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌వైజే గణాంకాధికారి బాబురెడ్డి, మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రె, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

లెక్చరర్ల సంఘం సభ్యులకు సత్కారం

తిరుపతి సిటీ : టీటీడీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల లెక్చరర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను టీటీడీ బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సోమవారం ఘనంగా సన్మానించింది. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, మాదన్న, ఉదయ, బి.ఉమామహేశ్వరి, శివకుమార్, రాజేష్‌లను బీసీ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్షుడు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ట్రెజరర్ కామరాజు సన్మానించారు.

యాదవ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శంకర్‌యాదవ్



శంకర్ యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న సంఘం జాతీయ నేతలు

తిరుపతి కల్చరల్: అఖిల భారత యాదవ యువజన మహాసభ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన శంకర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఢిల్లీలో అఖిల భారత యాదవ యువజన మహాసభ సంఘం సమావేశంలో ఈయనకు సంఘం జాతీయ అధ్యక్షుడు మహేష్ యాదవ్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి, యాదవ సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహారం



విద్యాసామగ్రి అందిస్తున్న తహసున్నీసా బేగం

తిరుపతి కల్చరల్ : ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీసాబేగం ఆధ్వర్యంలో ఓటేరు గంగిరెడ్డుల కాలనీలోని పేద విద్యార్థులకు సోమవారం పౌష్టికాహారం, విద్యాసామగ్రి వితరణ చేశారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షులు ఎస్.చంద్రకళారెడ్డి, భవ్యశ్రీ, పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



ర్యాలీ నిర్వహిస్తున్న రుయా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది



అమ్మపాల విశిష్టతను వివరిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

తిరుపతి తుడా : తల్లి పాలే బిడ్డకు శ్రీరామరక్ష అని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం రుయా చిన్నపిల్లల ఆస్పత్రి నుంచి అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు బహు పోషకాలు మెండుగా అందుతాయన్నారు. చిన్న పిల్లల ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే పాలు పట్టవచ్చని చెప్పారు. తక్షణం బిడ్డకు అవసరమైన శక్తి అమ్మ పాల ద్వారానే లభిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ అంజన్ కుమార్, డాక్టర్ కిరీటి పాల్గొన్నారు.

మాతృత్వం ఓ వరం

మాతృత్వం ఓ వరమని, తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అంకుర హాస్పిటల్ ఎండీ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. అంకుర ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. చంటి బిడ్డల తల్లులతోపాటు వారి సహాయకులకు అమ్మపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ బిడ్డలు ఆరోగ్యవంతంగా జీవించాలంటే అందుకు మొదటి అడుగు తల్లిపాలతోనే మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మా రెడ్డి, జనరల్ మేనేజర్ పవన్ పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతం

పాకాల : పురిటి బిడ్డకు అమ్మపాలే అమృతమని దామలచెరువు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్ వైజర్ కృష్ణవేణి తెలిపారు. మండలంలోని మద్దినాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రజని, నాగభూషణం, గీత, రాధా, ఆశా వర్కర్ సునీత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం




వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యమివ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని వెంటనే పరిష్కరించేలా సంబంధిత విభాగాల అధికారులకు అందించారు. కమిషనర్ మాట్లాడుతూ అలసత్వం లేకుండా నిర్ణీత గడువులో ప్రజా సమస్యలకు పరిష్కారమార్గం చూపాలని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు లేని దరఖాస్తుల సమాచారాన్ని సదరు అర్జీదారునికి రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పర్యటన

నగరంలోని మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, అలాగే మురుగు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. డ్రైనేజీ, పెద్ద కాలువలను పరిశీలించారు. ఈఎస్ఐ ఆస్పత్రి, స్విమ్స్ కూడలిలో అన్న క్యాంటీన్ల పనులను తనిఖీ చేశారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే నగరంలో మరమ్మతు చేయించిన బోర్లను పరిశీలించి, నీటి కొరత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ వ్యర్థాలను నగరంలో వేయకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, సెక్రటరీ రాధిక, డీఈఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, రాజు, శ్రావణి, ఆర్ఓ లు సేతు మాధవ్, కేఎల్ వర్మ, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

షిఫ్ట్ ఆపరేటర్లకు అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

చంద్రగిరి : ట్రాన్స్‌కో షిఫ్ట్ ఆపరేటర్లకు సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి, పాకాల మండల పరిధిలోని సుమారు 70 మంది షిఫ్ట్ ఆపరేటర్లు ఈ సదస్సుకు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు, బ్యాటరీలు, ఏ టు బీ స్విచ్‌ల నిర్వహణ తదితర పనులను వివరించారు. అలాగే విద్యుత్ పరికరాలపై అవగాహన కల్పించారు. షిఫ్ట్ ఆపరేటర్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేయాలని కోరారు. విద్యుత్ కోతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ వాసు రెడ్డి, ఇంజినీర్లు అమరబాబు, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమూల్ ద్వారా పాల సేకరణ
- జగనన్న పాల వెల్లువ కింద పాడి రైతులకు ఆదరణ
- కూటమి సర్కారు ఆదేశాలతో అమూల్ సంస్థ వెనకడుగు
- 21 నుంచి పాలు వద్దనడంతో మహిళల ఆందోళన

నిరసన వెల్లువ



కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన పాడి రైతులు

భాకరాపేట : సహకార డెయిరీ రంగానికి చేయూతనందించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న పాల వెల్లువ పథకం చేపట్టారు. ఏపీపీ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పాల సేకరణను ప్రారంభించారు. ఈ మేరకు అమూల్ సంస్థకు బాధ్యతలు అప్పగించారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించడంతో మహిళల్లో ఆనందం వెల్లివిరిసేది. ముఖ్యంగా చంద్రగిరి నియోజక వర్గంలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాల్లో అధికంగా పాల సేకరణ సాగేది. చిన్నగొట్టిగల్లు మండలంలో 1,200 మంది, ఎర్రావారిపాళెం మండలంలో 1,600 మంది మహిళలు పాడి పరిశ్రమతో ఉపాధి పొందేవారు. అమూల్ సంస్థ పాల సేకరణ చేపట్టిన తర్వాత ఆవు పాలు లీటరు రూ.38 నుంచి రూ.52 వరకు, గేదె పాలు లీటరు రూ.52 నుంచి రూ.85 వరకు గిట్టుబాటు అవుతుండడంతో మహిళలు సంతోషంగా పాడినే జీవనోపాధిగా భావించేవారు. ఈ క్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పొదుపు సంఘాలు, బ్యాంకుల, ప్రైవేటు వ్యక్తుల వద్ద రుణాలు తీసుకుని మరీ పశువులను కొనుగోలు చేసుకున్నారు.

కూటమి ప్రభుత్వంలో తలకిందులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాడి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ముందుగా అమూల్ సంస్థను పాల సేకరణ నుంచి పక్కకు తప్పించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు సంస్థ ద్వారానే ఈ నెల 21వ తేదీ నుంచి పాలు సేకరించడం లేదని పాడి రైతులకు సమాచారం అందించింది. దీంతో పాడినే నమ్ముకున్న మహిళలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. తమ పొట్ట కొట్టడం ధర్మం కాదని మండిపడుతున్నారు. ఎక్కడికక్కడ నిరసన తెలియజేస్తూ ఉద్యమ బాట పడుతున్నారు.

దిక్కుతోచడం లేదు



జగనన్న పాల వెల్లువతో మా కుటుంబ ఆదాయం పెరిగింది. పాలకు గిట్టుబాటు రావడంతో సంతోషంగా ఉండేది. అయితే ఇప్పుడు అమూల్ వాళ్లు పాలు వద్దంటున్నారు. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. మాలాంటి పేద రైతులకు అన్యాయం చేయడం ప్రభుత్వానికి తగదు.

– భావన, చెరువుముందరపల్లె

ఆనందం ఆవిరి



పాలతోనే జీవనం సాగించే మా కుటుంబానికి దాణాకు అయ్యే ఖర్చులు పోను కష్టం కూడా మిగిలేది కాదు. అలాగని ఆవులు లేకుండా జీవనం సాగేది కాదు. ఆలాంటి మా జీవితాలకు ఆమూల్ సంస్థ ఇచ్చే ధరతో మిగులుబాటులోకి వచ్చాం. ఆ ఆనందం కాస్తా ఆవిరి చేసేస్తున్నారు.

– రూప, రంగన్నగారిగడ్డ